


# కన్నీరింకని కథలు

## - షర్మిల



## ఇదెక్కడి న్యాయం !

**ఎంత తప్పు చేశాను !** ఈ మాట అనుకోవడం ఎన్ని వేల సార్లో లక్షల సార్లో ... జ్ఞాపకం లేదు

ఎప్పుడూ చురుగ్గా వుండే శైలబాల పెద్ద పెద్ద కళ్ళు నీటి చెరువుల్లా వున్నయ్యి.

ఎప్పుడు వరద ముంచెత్తుందో ఎప్పుడా చెరువు కట్టలు తెగి నీళ్ళు పొంగిపొరలుతాయో తెలియదు.

ఫోన్ మోగింది ... “చెప్పమ్మా” చాలా మామూలుగా అన్నాననుకుంది.

కానీ అమ్మ కదా ! కూతురు గొంతులో తానెన్నడూ గతంలో వినని బేలతనం వినిపించింది.

"శైలా ఏమ్మా ! వంట్లో బాగోలేదా అలా వుందేం గొంతు " అంది పావని.

"పీడకలొచ్చిందమ్మా ! అది నిజమో ! కలో " అంటుండగానే గొంతుకు ఏదో అడ్డం పడినట్టు దుఃఖం .

" సర్లే కాస్త సర్దుకున్నాక మెసేజ్ చెయ్యి. పిల్లలు ఎలా వున్నారు? నేను మీ నాన్న సర్దుకోవడంలో బిజీగా వున్నాం . రేపే కదా మా ప్రయాణం. అసలే అమెరికా వస్తే మళ్ళీ ఇక్కడికి ఆర్నెల్లకి గానీ తిరిగి రాము, ఇంకా చాలా పని వుంది బై " అని పావని ఫోన్ పెట్టేసింది.

నిద్రలో నవ్వుకుంటున్న మూడు నెలల ధన్యని చూసి నిట్టూర్చింది.

ఇంతలో డే కేర్ నుంచి పెద్ద కూతురు శ్రావ్యని తీసుకుని లోపలికి అడుగు పెట్టిన అవినాష్ ని ఆపుకోలేని అసహ్యంతో చూసింది.

" ఇక నుంచి దాన్ని నేనే తీసుకు వెళ్తాను , తీసుకుని వస్తాను... నువ్వెళొద్దు! " గట్టిగా అని శ్రావ్యని గుండెలకు అదుముకుని పిచ్చిదానిలా ఏడ్వడం మొదలెట్టింది.

"ఏమైందని ఇంత రాద్ధాంతం చేస్తున్నావ్? ఇక ఆపు నీ గోల ! " అని అవినాష్ అంటుండగానే ఒక్క ఉదుటన అతని చెంపలు వాయించబోయింది .

శైల రెండు చేతులూ గట్టిగా పట్టుకున్నాడు .

"వదులు నిన్ను చంపెయ్యాలనిపిస్తుంది. రాత్రి ఏం చేశావురా నా కూతుర్ని. ఈ సారి దాన్ని తాకితే నిన్ను బతకనివ్వను . దాని అమ్మ బతికుండగా దాన్ని ఏ పిశాచీ ఏం చెయ్యలేదు " చేతులు విదుల్చుకుని శ్రావ్యని లోపలికి తీసుకెళ్ళింది.

ఆరేళ్ళ శ్రావ్య ఎప్పుడూ నవ్వుతూ వుండే అమ్మ ఇలా ఎందుకు మారిందో అర్ధం కాక భయంగా చూస్తుంది .

పొద్దున్న లేచినప్పుడూ అమ్మ బరబరా లాక్కెళ్ళి గంటసేపు షవర్ కింద నుంచోబెట్టి వళ్ళంతా సోప్ తో తోముతూ ఏడుస్తూనే వుంది.

ఇప్పుడూ అలాగే వుంది .

"అమ్మా !ఏడవకు నీకు లాలీపాప్ ఇస్తాగా " అంది శైల కళ్ళు తుడుస్తూ.

" చిట్టి తల్లీ నిన్నెలా రక్షించుకోనే !" బాత్ రూం లోనే కూలబడి తలపట్టుకుంది శైల. చిన్నది పుట్టిన దగ్గర నుంచి శ్రావ్య వాళ్ళ నాన్న దగ్గరే నిద్ర పోతుంది. తను కూడా  బాలింత పైగా పసిపిల్లని సొంతం తనే చూసుకుంటూ పక్క గదిలో పడుకుంటుంది.

నిన్న రాత్రి పసిది పడుకున్నాక శ్రావ్య సరిగ్గా తిన్లేదని కాసిని పాలు సిపికప్ లో పోసి తలుపు తీసి లైటేయగానే ఎదురుగా కనబడిన దృశ్యం చూసి మాట పడిపోయిన దానిలా అయిపోయింది.

... లోన అగ్నిపర్వతాలు బద్దలవుతుండగా మౌనంగా నిద్రలో వున్న శ్రావ్యని భుజానేసుకుని తన గదిలోకి తెచ్చుకుంది.

పొద్దున లేచాక ఏ పశ్చాత్తాపం లేక పోగా " సర్లే జరిగింది మర్చిపో , ... అయినా కొంపలు మునిగేంత ఏం జరగలేదులే" తిరస్కారంగా అతగాడు మాట్లాడిన ఆ మాటలు ఆమె గుండెల్లో మంటలు పుట్టించాయి.

మీరు అనేదల్లా ఏకవచనంలోకి మారిపోయింది "ఒరేయ్ పాము తన పిల్లల్నే మింగేస్తుందంటే ఆశ్చర్యపోయాను కదరా. నువ్వు చేసింది ఇంకా  దారుణం. ఛీ ఇక నీ ముఖం చూడ బుద్ధి కావడం లేదు , ప్లీజ్ రెండు రోజులు ఎక్కడికన్నా వెళ్ళిపో నీకు దణ్ణం పెడతాను. నన్ను నా బిడ్డల్ని మాత్రమే వదిలెయ్. నన్ను ఒంటరిగా ఏడ్వనీ." అరిచి నీరసంగా మంచం మీద పిల్ల పక్కన వాలిపోయింది .

మెయిన్ డోర్  లాక్ చేసిన చప్పుడు విని కిటికీలో నుంచి చూసింది. కారెక్కుతున్న అవినాష్ కనిపించాడు.

ఆ రాత్రి అతను రాలేదు . ఏడ్చాకా చిత్రంగా గుండె రాయిగా మారింది.

పొద్దున్నే లేచి చక చకా పిల్లకి సీరియల్ తినిపించి , తనూ పాలు సీరియల్ తింది. చిన్న దాని డైపర్ బాగ్ సర్దింది. వెనుక కార్ సీట్లో పసి దాన్ని పడుకోబెట్టి , ఇంకో కార్ సీట్ లో శ్రావ్యని కూర్చోబెట్టి ఎయిర్ పోర్ట్ వైపు కార్ పోనిచ్చింది.

అమ్మానాన్నల్ని చూస్తున్నానన్న ఆనందం కంటే రాబోయే పరిణామాలు ఎలా వుంటాయో అనే ఆందోళన మనసులో ముసురుకుంది. మధ్యతరగతి కుటుంబం తను చెల్లి. అమ్మ ఉద్యోగం నాన్న చిన్నపాటి వ్యాపారంతో ఇద్దరినీ చక్కగా చదివించారు. వాళ్ళ ఆశలకు అనుగుణంగా ఎప్పుడూ క్లాస్ లో ఫస్ట్ రాంక్ తెచ్చుకుంది. బిట్స్ లో ఇంజనీరింగ్ లో చేరింది.

అప్పుడే అవినాష్ తో పరిచయం. అతనికి తన మీద ప్రేమ వుందని ఆఖరి సంవత్సరంలో తెలిసింది. ఎమ్మెస్ కి అమెరికా వచ్చే ముందు ప్రపోజ్ చేశాడు అవినాష్. కాదనడానికి కారణాలేం కనబడ లేదు.

ఎమ్మెస్ ఆయ్యాక చూద్దామంది. అదే చనువుతో ఆమె అమెరికాలో వున్న రెండేళ్ళు ఫోన్లు,చాటింగ్ లతో ఇంకాస్త బంధం బలపడింది. చదువయ్యాక పెళ్ళి మాటలకు తండ్రి అవినాష్ ఊరెళ్ళినప్పుడు తమ కులం పెద్దదని పెళ్ళి కుదరదని చెప్పేశారు.

అవినాష్ గొడవ చేయడంతో కోటి  రూపాయలు కట్నం  ఇస్తే  చేస్తామన్నారు. కూతురు ఇష్టాల్ని ఏనాడూ కాదనని అమ్మానాన్నా వాళ్ళు కూడబెట్టి కొనుక్కున్న స్థలం అమ్మి పెళ్ళి చేశారు. అదే తను చేసిన పొరపాటు. ఎందరో తనతో పాటు వుద్యోగం చేసే వాళ్ళు ప్రపోజ్ చేసినా అవినాష్ కి మాట ఇచ్చానన్న ఒకే కారణంతో అన్నీ తిరస్కరించింది.

వాళ్ళు కట్నాలని, లాంచనాలనీ వేధించినప్పుడైనా అవినాష్ తన తల్లితండ్రులని వద్దని చెప్పలేదు. తనకి కోట్ల రూపాయలు ఇచ్చి పెళ్ళిచేసే తన కులపు వాళ్ళ సంబంధాలు శైల కోసం ఒదులుకున్నానని అర్ధం చేసుకోమని ప్రాధేయ పడ్డాడు.

పెళ్ళయ్యాక కూడా అత్తగారు కొడుక్కి వచ్చిన గొప్ప సంబంధాల గురించి దప్పు కొడుతుంటే చిరాకొచ్చి అక్కడి నుంచి వెళ్ళిపోయేది.

ఇంతలో ఫోన్ రింగ్ అయ్యింది  "శైలా ! ఇమ్మిగ్రేషన్ లో స్టాంపింగ్ అయ్యిందమ్మా బయటకు వచ్చి వెయిట్ చేస్తున్నాం " అన్నాడు సుదర్శన్.

"సరే డాడీ వచ్చేశాను ...అక్కడే వుండండి "అని అరైవల్స్ దగ్గరకి కార్ పోనిచ్చింది. నవ్వుతూ అమ్మానాన్నలు చేతులూపుతూ కనిపించారు .

లగేజీ తీసి తండ్రి సాయంతో ట్రంక్ లో పెట్టింది. ఈలోగా కారులోకి ఎక్కిన తల్లి చిన్న మనవరాల్ని చూసుకుని పెద్ద మనవరాల్ని పలకరిస్తూ పావని ఆనందపడుతోంది.

ఇంటికి చేరే వరకూ ఎప్పుడూ గలగల మాట్లాడే శైల తెచ్చిపెట్టుకున్న నవ్వుతో మాట్లాడడం తల్లి తండ్రులిద్దరూ గమనించారు.

ఏదో మొగుడూ పెళ్ళాలు తగువు పడి వుంటారనుకున్నారు.

సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చిన అవినాష్ "బాగున్నారా !"అని పలకరించి రూంలోకి వెళ్ళి పోయాడు.

శైల మెటర్నటీ లీవ్ అయ్యే సమయానికి అమ్మానాన్నల్ని రమ్మంది. పసిపిల్లని అమ్మ దగ్గర వుంచి వెళ్తే నిశ్చింతగా వుంటుందనిపించింది.

చెల్లెలు సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తోంది. అమ్మమ్మ కూడా ఇంట్లోనే వుంటుంది కాబట్టి ఏ ఇబ్బందీ లేదు.

మర్నాడు అవినాష్ ఆఫీస్ కి వెళ్ళాక జరిగిందంతా చెప్పి ఏడ్చింది. కళ్ళు తుడుచుకుంటూ "నేను డైవోర్స్ కి అప్లై చేస్తాను "అంది.

కొంచం సేపు నిర్ఘాంత పోయారు . ఇలాంటివి ఎక్కడో చదవడమే కానీ ఎప్పుడూ తెలియదు.

"నువ్వు పొరపాటు పడ్డావేమో ! బిడ్డని ఆ దృష్టితో చూసే పాపాత్ముడు ఎవరుంటారు ? " అన్నాడు సుదర్శన్ అయోమయంగా !

పావని మాత్రం గుండెల్లో రాయి పడినట్టు బిగుసుకు పోయింది. కాసేపటికి తేరుకుని " అమ్మా శైలా వున్నదాన్లో ఎంతో కష్టపడి నీ పెళ్ళి చేశాం... ఇంకా చెల్లి పెళ్ళి చెయ్యాలి. ఏదో నువ్వా సాయంగా వుంటున్నావ్ ,దానికీ పెళ్ళి చేసి హాయిగా కాలం గడుపుదామనుకుంటున్నాం.

తొందరపడి ఏ నిర్ణయం తీసుకో వద్దు. నువ్వు డైవోర్స్ తీసుకుంటే చెల్లి పెళ్ళికి సంబంధాలేం వస్తాయమ్మా ? " అని కారే కన్నీరు తుడుచుకుంది.

" మీరిద్దరూ నన్ను అర్థం చేసుకోరా ? నేను వాడి నీడ కూడా భరించలేను. ఇప్పుడే కాదు వాడు నీచుడని ఇప్పుడర్థం అవుతోంది. కజిన్ అని ఒకమ్మాయిని ఇంట్లో కొన్నాళ్ళు వుంచాడు.

నాకు అప్పుడు అనుమానం రాలేదు ఇప్పుడు నాకర్థం అవుతోంది. ప్లీజ్ అమ్మా ! నాకు విముక్తి కావాలి ..." అమ్మ వళ్ళో వాలిపోయి భోరుమంది.

కూతుళ్ళని ప్రాణం కన్నా మిన్నగా చూసుకున్న ఆ నాన్నకి ఏం చేయాలో అర్థం కాలేదు.

నాలుగు రోజులు తీవ్రంగా అలోచించారు ఇద్దరూ !

దిగులుగా కూర్చున్న శైల పక్కన కూర్చున్నాడు సుదర్శన్. తల నిమురుతూ ఇలా అన్నాడు " నీకు ఇష్టమైనట్టే చెయ్యమ్మా. ఇక్కడ డైవోర్స్ అంటే చిన్న విషయం కాదు. నువ్వు పిల్లల కోసం పెద్ద యుద్ధమే చెయ్యాలి.

నువ్వు ఇన్నాళ్ళూ కూడగట్టుకున్న సొమ్ముతో ఈ ఇల్లు కొన్నావు. అతను తన డబ్బంతా వాళ్ళ అమ్మానాన్నలకే పంపుతాడని చెప్పావు. ఇక్కడి లా ప్రకారం నీ ఇంటిలో సగం వాటా అతనిదే అవుతుందట నా స్నేహితుడు ఒకరు చెప్పారు.''

"పోతే పోనీ డేడీ . నా డబ్బంతా పోనీ ...యుద్ధమే చేయాల్సి వచ్చినా పర్లేదు. నా ప్రాణం వున్నంత వరకూ నా బిడ్డల్ని చూసుకుంటూ బతికేస్తాను. నేను మాత్రం వాడితో మళ్ళీ కాపురం చెయ్యలేను."

పోరుకు సిద్ధమైంది. ఇంటి వాటాకింద ఇంటి విలువలో సగం డబ్బు ఇచ్చేసింది. వున్న ఉద్యోగంలో ఇంటి లోను , పిల్లల ఖర్చు, లాయర్ల ఖర్చు కష్టంగా సరిపోతున్నాయి .

మానసిక క్షోభ శైలని డిప్రెషన్ లో కి నెట్టింది. మందులు వాడుతోంది. మూడేళ్ళుగా పోరాటం జరుగుతూనే వుంది. పిల్లల్ని తండ్రికీ రెండు రోజుల పాటు అప్పగించాలన్న కోర్ట్ ఆదేశాలతో కుప్పకూలి పోయింది. విడాకుల కోసం అబద్ధం ఆడిందన్న అవినాష్ వాదన నమ్ముతోంది కోర్ట్ .

పిల్ల పట్ల అతని అమానవీయ చర్యను తను చూసినా నిరూపించలేని అసహాయత కుంగతీస్తోంది.ఈ నాలుగేళ్ళలో తల్లి ఆరోగ్యం క్షీణించింది.

తండ్రి శాయశక్తులా ఇండియాలో శైల వేసిన కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

పెద్ద పిల్ల కి ఊహ వచ్చింది తాను తండ్రి దగ్గరకి వెళ్ళనని గుమ్మం దగ్గరే కూర్చుంటుంది గానీ కారెక్కదు. అక్క తో పాటు చెల్లీ ఏడుస్తుంది.

అది చూసి శైల లోపల గదిలో ఏడ్వడం . పిల్లలికి కౌన్సిలింగులనీ , థెరపీలనీ వేల వేల డాలర్లు ఖర్చవుతున్నాయి.

ఇక అమెరికాలో న్యాయం దక్కకపోగా ఏ పిల్లల కోసం సర్వ శక్తులు ఒడ్డి పోరాడుతోందో వారిని ఆ మృగానికి అప్పగించాల్సి వస్తుందన్న భయం వెంటాడుతోంది.

కొందరు ఇండియాలో పెళ్ళి జరిగింది కాబట్టి అక్కడే పరిష్కరించుకోమని సలహా ఇచ్చారు.

తల్లి ఆరోగ్యం క్షీణిస్తోందని నాలుగు రోజులకు ఇండియా వెళ్ళింది శైల.

పిల్లలికి జాగ్రత్తలు చెప్పి గత్యంతరం లేక అవినాష్ దగ్గర వుంచి వెళ్ళింది, ఒక రోజు

పార్క్ లో ఏడుస్తున్న శ్రావ్య , ధన్యలను చూసిన ఒక అమెరికన్ మహిళ పోలీసులకి ఫోన్ చేసింది. తన మాట వినడం లేదని బెదిరించడానికి పార్క్ లో వదిలేసి వెళ్ళానని అవినాష్ పోలీసులకి చెప్పాడు.

పిల్లలు తండ్రి దగ్గరకి వెళ్ళమని చెప్పడం తో వారిని ప్రభుత్వం నడిపే సోషల్ సర్వీసెస్ ఫాస్టర్ హోం కి తరలించారు....

ఈ కథలో కన్నీరు ఎప్పటికీ ఇంకిపోదు..!!

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments